సాక్షి
ఖమ్మం
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



ప్రతిభావంతులకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల ఎనిమిదో తరగతి విద్యార్థులకు నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందించేలా పరీక్ష నిర్వహించనున్నారు. 8లో



డెంగీ నివారణకు చర్యలు

డెంగీ కేసులు నమోదు కాకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించామని జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

కణకణం.. అగ్నిగోళం

రజాకార్ల అరాచకాలకు ఉమ్మడి జిల్లా ఎదురొడ్డి నిలిచింది. నిజాం సేనల ఆకృత్యాలకు వ్యతిరేకంగా పలువురు ప్రాణాలను ఫణంగా పెట్టారు. చివరి నిజాం మీర్ ఉస్మాన్‌అలీఖాన్, గ్రామాల్లోని దొరల ఆగడాలు, అణచివేతపై జిల్లా తిరగబడుతూ బందూకులై గర్జించారు. తద్వారా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పుటల్లో జిల్లాకు ప్రత్యేక స్థానం లభించింది. నాటి పోరాటం, అమరుల స్మరణతో ఏటా సెప్టెంబర్ 17న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

రజాకార్లకు ఎదురొడ్డిన ఉమ్మడి జిల్లా

- పదపదమంటూ పోరుబాట పట్టిన పల్లెలు
- తెలంగాణ సాయుధ పోరులో వీరోచిత చరిత్ర
- నాటి పోరాటం, అమరులకు గుర్తుగా గ్రామగ్రామాన స్తూపాలు

రావెళ్ల మార్గదర్శకంలో..

బోనకల్ మండలం చిరునోములకు చెందిన రావెళ్ల జానకీరామయ్య వరంగల్ జిల్లా ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆయన నాయకత్వంలో యువత కదం తొక్కింది. భూస్వాములు, జమీందార్ల ఆగడాలకు వ్యతిరేకంగా జానకీరామయ్య నేతృత్వాన లక్ష్మీపురంలోని మల్లెల వెంకటేశ్వర్లు దళ కమాండర్‌గా, గోవిందాపురానికి చెందిన తమ్మారపు గోవిందు, చుండూరు నరసింహారావు, జొన్నలగడ్డ రామయ్య ఉప కమాండర్లుగా పోరాడారు. లక్ష్మీపురంతోపాటు బ్రాహ్మణపల్లి, ముష్టికుంట్ల తదితర గ్రామాల యువకులు ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపారు.

ఎర్ర కెరటమైన పిండిప్రోలు

తెలంగాణ సాయుధ పోరులో తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు ఎర్ర కెరటమైంది. కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర రాజేశ్వరరావు, భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, రాయల వెంకటనారాయణ వంటి నేతలు ఇక్కడే సమావేశాలు నిర్వహించి పోరాటానికి ఊపిరిలూదారు. దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచారు. గ్రామానికి చెందిన రాయల వెంకటనారాయణ దళ కమాండర్‌గా పనిచేయగా.. పలువురు యువకులు పోరాటంలో అమరులయ్యారు.

తిరుగుబావుటా

నిజాం నవాబుల పాలనపై ఎర్రుపాలెం మండలం మీనవోలు పోరాటయోధులు తిరగబడ్డారు. ఎర్రుపాలెంలో నిజాం నవాబులు క్యాంపు ఏర్పాటుచేస్తే, క్యాంప్ ఇన్‌చార్జి, బ్రిటిష్ అధికారి సార్జెంట్ తరచూ దాడులతో ప్రజల సొమ్ము కాజేసేవారు. దీంతో 1948 జనవరి 15న గ్రామస్తులంతా తిరగబడ్డారు. ఈటెలతో దాడి చేయగా.. సార్జెంట్ విచక్షణా రహితంగా తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రాంపల్లి రామయ్య, సుఖభోగి ముత్తయ్య, తోట బాలయ్య, పిల్లి కాటయ్య, బండి వీరయ్య, మెట్టల శ్రీరాములు, తోట వెంకయ్య ప్రాణాలు కోల్పోయారు. ఆతర్వాత తిరుగుబాటును అణచివేసేలా రజాకార్లను రైలులో రప్పించి పలువురి ఇళ్లను తగలబెట్టారు. గ్రామంలో పరిస్థితి చేయి దాటడంతో పలువురు ఊరు విడిచివెళ్లారు.

ఒకే చితిపై ఏడుగురు



గోవిందాపురం(ఎల్)లో ఏడుగురిని కాల్చిన స్థలంలో నిర్మించిన స్థూపం

నాటి మధిర తాలుకాలో నిజాం సైన్యం, రజాకార్ల మూకలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల కోసం గాలించాయి. గోవిందాపురం సరిహద్దు వద్ద 1948 ఫిబ్రవరి 10న వివిధ గ్రామాలకు చెందిన యల్లమందల చంద్రయ్య, మంద అచ్చయ్య, మద్ది రాములు, గొర్రుముచ్చు హాజరయ్య, కొత్తపల్లి కృష్ణమూర్తి, సామినేని గోపయ్య, మడుపల్లి వీరస్వామి, తమ్మినేని బుచ్చయ్య, తమ్మారపు వెంకటకోటయ్యను బంధించగా వెంకటకోటయ్య సైన్యం కళ్లుకప్పి తప్పించుకున్నారు. ఇక కృష్ణమూర్తి చిన్నవయస్కుడని వదిలివేశారు. మిగిలిన ఏడుగురిని జనం చూస్తుండగా మంగలి గుట్టపై చంపి ఒకే చితిపై కాల్చారు.

అడవుల్లో తలదాచుకుని..



అరెగూడెం వద్ద ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వీరయ్య (ఫైల్)

ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన ఏరియా కమాండర్ మచ్చ వీరయ్య 33 ఏళ్ల వయసులో 1949 జనవరి 17న ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసాడు. గోకినేపల్లి సరిహద్దు ఆరెగూడెం వాగులో బట్టలు ఉతికేందుకు కొరియర్ కృష్ణమూర్తితో కలిసి వెళ్లగా ఇద్దరినీ కాల్చిచంపారు. మేడేపల్లికి చెందిన ఎందరో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకారులను ఎదిరించి పోరాడారు. ఇక్కడి యువకులు తుపాకులతో అడవుల్లో స్థావరాలు ఏర్పాటుచేసుకుని నల్లమల గిరిప్రసాద్ నాయకత్వాన పోరాటం చేశారు.

తనికెళ్లపై రజాకార్ల దాడులు



పుచ్చలపల్లి సుందరయ్యతో గడల సీతారామయ్య (సర్కిల్‌లో)

కొణిజర్లకు చెందిన దొండపాటి వెంకయ్య, షేక్ మహబూబ్ అలీ, తనికెళ్లకు చెందిన గడల సీతారామయ్య, గడల రామకృష్ణయ్య, గడల ముత్తయ్య, యాస వెంకటలాలయ్య తదితరులు మల్లెల వెంకటేశ్వరరావు దళంలో పనిచేశారు. నల్లమల గిరిప్రసాద్, షేక్ రజబ్ అలీ నేతృత్వాన నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారు. పుచ్చలపల్లి సుందరయ్యతో కూడా కలిసి పనిచేసిన అనుభవం వీరికి ఉంది. రజాకార్లు తనికెళ్లపై దాడులు జరిపి కనిపించిన వారినల్లా హింసించారు. దళంలో ముఖ్యుడైన గడల సీతారామయ్య ఆచూకీ చెప్పమని చిత్రహింసలకు గురిచేస్తూ, ఓ వ్యక్తి మృతదేహాన్ని తీసుకొస్తే ఆయనే సీతారామయ్యగా రజాకార్లను నమ్మించారు.

నేడు సాయుధ పోరాట వారోత్సవాల సభ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. గత వారం రోజులుగా అమరువీరులకు నివాళులర్పించడమేకాక సభను విజయవంతమయ్యేలా ప్రచారం చేశామని వెల్లడించారు. ఈమేరకు బుధవారం జరిగే సభలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ.బేబి, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సుదర్శన్‌రావుతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

3

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/ఖమ్మం మయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం ఖమ్మం కైకొండాయిగూడెం, నేలకొండపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల పనులకు శంకుస్థాపన చేశాక కొత్తకొత్తూరులో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి నేలకొండపల్లిలో సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభిస్తారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు

ఖమ్మంక్రైం: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఈనెల 22నుంచి పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలు జరగనున్న నేపథ్యాన కేంద్రాల వద్ద ఆంక్షలు అమలుచేయనున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల హైస్కూళ్ల వద్ద ఉదయం 8నుంచి సాయంత్రం 6-30గంటల వరకు బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్-2023 అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఈమేరకు 22నుంచి 29వ తేదీ వరకు కేంద్రాల వద్ద గుంపులుగా ఉండొద్దని, సభలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి ఉండదని తెలిపారు.

రేపటి నుంచి సదరం క్యాంప్‌లు

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగుల వైకల్య పరీక్షలు నిర్వహించి సదరమ్(యూడీ ఐడీ) సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ఈనెల 18 నుంచి 30 వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరాలు ఉంటాయని వెల్లడించారు. ఈనెల 18న ఆర్థో, 23న వినికిడి లోపం, 25న దృష్టి లోపం, 30న మానసిక దివ్యాంగులకు పరీక్షలు ఇర్వహిస్తామని తెలిపారు. కొత్తవారికి 130, రెన్యువల్‌కు 40 స్లాట్లు కేటాయించినందున స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఇతర పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

కాపీయింగ్‌ను ఉపేక్షించేది లేదు



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం సహకార నగర్: పరీక్షల్లో ఎవరైనా సరే మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కాట్ల రాజేందర్ హెచ్చరించారు. ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ పరీక్షలను మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కాపీయింగ్‌కు తావు లేకుండా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. అదనపు పరీక్షల నియంత్రనాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి, ఏఆర్ కోల శంకర్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ శ్యాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



యూనిఫామ్ అందజేస్తున్న డీఐఈఓ రవిబాబు

కూసుమంచి: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) రవిబాబు సూచించారు. కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించిన ఆయన రికార్డులు, హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. అలాగే, బోధన, విద్యార్థుల ప్రగతిపై ప్రిన్సిపాల్ వీరభద్రరావు, అధ్యాపకులతో సమీక్షించారు. ఆతర్వాత కళాశాల విద్యార్థులకు డీఐఈఓ యూనిఫామ్ పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పక హాజరయ్యేలా అధ్యాపకులు పర్యవేక్షిస్తూ మెరుగైన బోధనతో ఫలితాల్లో ముందు నిలపాలని సూచించారు.

డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని గుర్తించండి



బ్రాహ్మణపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్త డంపింగ్‌కు అవసరమైన స్థలాన్ని త్వరగా గుర్తించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి, పల్లిపాడు, లాలాపురం తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను మంగళవారం పరిశీలించిన ఆమె మూడెకరాలకు తగ్గకుండా స్థలం ఎంపిక చేయాలని తెలిపారు. అయితే, తల్లాడ మండలం కొడవటిమెట్ట వద్ద ప్రభుత్వ స్థలాన్ని గతంలో కేటాయించినా దూరం కావడంతో చెత్త తరలింపు ఇబ్బందిగా మారిందని అధికారులు తెలిపారు. దీంతో పల్లిపాడు – లాలాపురం సమీపాన 1.36 ఎకరాల ప్రభుత్వ స్థలం రికార్డులు అందజేయాలని కొణిజర్ల తహసీల్దార్ ఎస్.అరుణకు ఫోన్‌లో సూచించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గంలోని తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ యు.గురులింగం తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై చొరవ తీసుకోండి

- కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల వినతి



కేంద్ర మంత్రి రాంమోహన్‌నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న తుమ్మల

ఖమ్మంఅర్బన్/ఇల్లెందు: కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుకు వివరాలు అందజేసి మాట్లాడారు. గతంలో గుర్తించిన స్థలం అనుకూలంగా లేదని తేల్చారని తెలిపారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించిన నేపథ్యాన సర్వే చేయించాలని కోరారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటైతే భద్రాచలం రామాలయానికి వచ్చే భక్తులే కాక సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ పరిశ్రమలకు వచ్చివెళ్లే అధికారులకు అనువుగా ఉంటుందని తెలిపారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ.కుమారస్వామిని కూడా కలిసిన తుమ్మల.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ఆవశ్యకతను వివరించారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటు చేసే స్టాళ్లను భట్టి విక్రమార్క సందర్శిస్తారు.

యూనిట్లకు సకాలంలో అనుమతులు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: పరిశ్రమలకు సంబంధించి యూనిట్ల ఏర్పాట్లకు అందిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి టీజీ ఐ–పాస్ కమిటీ సమావేశంలో పలు దరఖాస్తులు, అభ్యంతరాలను సమీక్షించారు. ఇందులో గ్రానైట్, రైస్ మిల్లులు, క్రూడ్ పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సరైన వనరులు ఉన్నందున ఔత్సాహికులను ప్రోత్సహించాలని తెలిపారు. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇదే సమయాన స్థానిక యువతకు ఉపాధి లభించేలా డిగ్రీ కళాశాలలు, ఐటీఐల్లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, మైనింగ్ ఏడీ సాయినాథ్, ఆర్‌టీఓ వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్, గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.యుగంధర్, కె.గోపాల్‌రావు పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్‌కు సామగ్రి అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

రక్షణ సామగ్రి పంపిణీ

ప్రకృతి విపత్తుల సమయాన ఉపయోగించే రక్షణ సామగ్రిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లకు అందజేశారు. వీటిని విపత్తుల సమయాన వినియోగానికి భద్రపర్చాలని సూచించారు. ఇందులో మైక్‌లు, టార్చిలైట్లు తదితర సామగ్రి ఉన్నాయి. డీఆర్వో పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తహసీల్దార్లు పి.రాంప్రసాద్, అరుణ, శ్వేత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ పాల్గొన్నారు.

ఆరు సొసైటీల పాలకవర్గాలు రద్దు

- ఆ స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిల నియామకం
- మరో ఆరింటిపై త్వరలోనే నిర్ణయం



పాలకవర్గం రద్దయిన కల్లూరు పీఏసీఎస్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) పాలకవర్గాలను మంగళవారం రద్దు చేశారు. ఆ స్థానంలో సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉండగా మొత్తం 101 పీఏసీఎస్‌లకు గాను ఖమ్మం జిల్లాలో 76 ఉన్నాయి. వీటి పాలకవర్గాల ఐదేళ్ల కాలపరిమితి ఆగస్టు 14తో ముగియగా పాత పాలకవర్గాలనే ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదేసమయాన పనితీరు సరిగ్గా లేని, అక్రమాలు జరిగిన చోట పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని ఆదేశించింది.

62 పాలకవర్గాల కొనసాగింపు

జిల్లాలో మొత్తం 76 పీఏసీఎస్‌లకు గాను ఏదులాపురం, చేగొమ్మ, నేలకొండపల్లి, తల్లాడ, కల్లూరు, పోచారం సొసైటీల పాలక వర్గాలను రద్దు చేశారు. ఈ మేరకు వీటి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు జి.ఉషశ్రీ, ఎస్‌బీ వీ.రామిరెడ్డి, కె.రాజశేఖర్, జి.శ్రీనివాసకుమార్, సీహెచ్.రవికుమార్, ఎన్.ఉషారాణిని నియమిస్తూ జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కుర్నవల్లి, అమ్మపాలెం సంఘాల పాలకవర్గాలు రద్దు కాగా అక్కడ పర్సన్ ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగుతోంది. ఇక మిగిలిన 68 పీఏసీఎస్‌ల్లో మరో ఆరింటి పాలకవర్గాలను కూడా రద్దు చేయనున్నట్లు తెలుస్తుండగా, మిగతా 62 సంఘాలకు ప్రస్తుత పాలకవర్గాలనే కొనసాగిస్తారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో 21 పీఏసీఎస్‌లకు గాను 17 సంఘాల పాలకవర్గాల కొనసాగిస్తూ ఆ జిల్లా సహకార అధికారి అవధానుల శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా నాలిగింటిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.కోట్ల విలువైన భూమి స్వాధీనం

'సాగర్' స్థలాల అన్యాక్రాంతంపై ఫిర్యాదులు రావడంతో చర్యలు



స్థలానికి ఫెన్సింగ్ వేయిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పాకబండ రెవెన్యూలో రూ.కోట్ల విలువ చేసే సాగర్ మేజర్ కాల్వ–2 మిగులు భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాల్వ భూమి ఆక్రమణకు గురవుతోందని అందిన ఫిర్యాదుతో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 88లో రెండెకరాల నాలుగు గుంటల భూమిని ఓ వ్యక్తి ఆయన భూమిలో అక్రమంగా కలుపుకున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి విలువ మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. ఆపై భూమిని చదును చేయించగా ఫెన్సింగ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాక మొక్కలు నాటనున్నట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, సర్వేయర్లు కె.శ్రీనివాస్, నాగేశ్వరరావు, జలవనరుల శాఖ డీఈ ఉదయప్రతాప్‌తో పాటు కేఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువులకు పూర్వవైభవం

- మూడింటి అభివృద్ధికి రూ.75 కోట్లతో ప్రతిపాదనలు
- కట్టల బలోపేతం, ఘాట్ల నిర్మాణానికి నిర్ణయం



అలుగు పారుతున్న పుట్టకోట చెరువు (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఒకప్పుడు గ్రామాలు, నగరాల ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించిన చెరువులు కాలక్రమంలో కాలగర్భంలో కలిసే స్థితికి చేరాయి. ఆక్రమణలకు తోడు మురుగునీరు చేరడంతో వాటి వైభవం కోల్పోయాయి. అయితే, ఇలాంటి చెరువులను పునరుద్ధరించి పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఖానాపురం చెరువు, ధంసలాపురం పెద్ద చెరువు, పుట్టకోట(వెలుగుమట్ల) చెరువుల అభివృద్ధికి జలవనరుల శాఖ సుమారు రూ.25 కోట్ల చొప్పున అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

ఆక్రమణల నివారణ, బలమైన కట్టలు

చెరువుల అభివృద్ధిలో భాగంగా తొలిదశ శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపడతారు. పూర్తిస్థాయిలో శిఖం భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటుచేయడమే కాక చుట్టూ కట్టలను బలోపేతం చేస్తారు. అంతేకాక తూములు, అలుగులకు మరమ్మతు చేసి చెరువుల చుట్టూ సుమారు ఆరు కిలోమీటర్ల మేర బలపరుస్తారు. కట్ట పైనుంచి మట్టి జారకుండా రాళ్లు ఏర్పాటుచేసి కట్టపై రక్షణ కంచె ఏర్పాటుచేయనున్నారు. అలాగే, చెరువులోకి నీరు వచ్చే వాగులపై వంతెనలు నిర్మించి అలుగుల వద్ద కూడా రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెనల నిర్మాణం చేయాలని ప్రతిపాదనల్లో పొందుపర్చారు.

మురుగునీరు చేరకుండా...

ఖమ్మం నియోజకవర్గంలోని ఎనిమిది చెరువులను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. తొలిదశలో మూడు చెరువులకు సంబంధించి ప్రతిపాదనలు పంపగా, దశల వారీగా మిగతా చెరువులపై దృష్టి సారించనున్నారు. నిధులు మంజూరు కాగానే ప్రతీ చెరువుకు నాలుగు వైపులా బతుకమ్మ ఘాట్లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక మురుగునీరు చేరకుండా, కట్టలపై వరద నీరుతో కోతకు గురి కాకుండా నీటి మళ్లింపునకు కాల్వలు నిర్మిస్తారు. ఫలితంగా చెరువులు శుభ్రంగా మారి ఉత్సవాలకు, సాయంకాలం స్థానికులు సేద తీరే వేదికగా నిలవనున్నాయి. ఇదే సమయాన మొక్కలు నాటడంతో పాటు పర్యాటక శాఖ ద్వారా కేఫ్‌లు కూడా ఏర్పాటుచేయాలనే ఆలోచనలో ఉన్నారు.

క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా వాసుదేవరావు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో వాసుదేవరావు, కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల ప్రకటించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన దేవకీ వాసుదేవరావు రాష్ట్ర కోశాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు, నాయకులు మందడపు సుబ్బారావు, పుల్లారావు యాదవ్,రంగాకిరణ్, నున్న రవికుమార్, నంబూరి రామలింగేశ్వర రావు, ఏలూరి నాగేశ్వరరావు, సుదర్శన్ మిశ్రా, పెరుమాళ్లపల్లి విజయరాజు, వీరవల్లి రాజేష్, కోటేశ్వరరావు, వేల్పుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్.దీప్తి, కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని సెడార్ వాలీ స్కూల్‌లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 2007 మే 31 తర్వాత జన్మించిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో సాయంతం 4–30 గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.3.30 కోట్లు

బోనకల్: బోనకల్ మండలం మోటమర్రిలోని ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.3.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ పథకం పైపులైన్లు, మోటార్లు ధ్వంసమై ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఈ విషయాన్ని స్థానిక రైతులు, నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా పూర్తిస్థాయిలో మరమ్మతులు, అవసరమైన నిర్మాణాల కోసం రూ.3.30కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఆర్ఎస్‌కు ఎంపికైన కల్లూరు వాసికి పోస్టింగ్



నాగరాజ్‌నాయక్

కల్లూరురూరల్: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాకు చెందిన బానోతు నాగరాజ్‌నాయక్ 697వర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ అనంతరం సోమవారం ఆయనకు పోస్టింగ్ లభించింది. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తదితరులు మంగళవారం వాచ్యానాయక్ తండాకు వెళ్లి నాగరాజు తల్లిదండ్రులను అభినందించారు. కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు భాగం ప్రభాకర్, ఆళ్లకుంట నర్సింహారావు, పెద్దబోయిన శ్రీనివాసరావు, ఏనుగు సత్యంబాబు పాల్గొన్నారు.

19న గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ ముట్టడి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: గిరిజన సంక్షేమ శాఖలోని పెండింగ్ సమస్యలపరిష్కారానికిఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం వారుమాట్లాడుతూఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు ఇతరసమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బానోత్ రాందాస్, ధర్మసోత్ నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, రాంబాబు, సురేష్, రామకృష్ణ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	3,000
కందులు	5,800	3,500
ఏసీ మిర్చి	14,800	8,000
మిర్చి	8,200	7,500
కొత్త పత్తి	6,318	5,000
పత్తి	7,400	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు
- పరీక్ష ద్వారా అర్హులైన విద్యార్థుల ఎంపిక
- జాబితాలో చోటు దక్కితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలు



కొణిజర్ల: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చి ప్రోత్సహించేలా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ప్రవేశపరీక్షకు రంగం సిద్ధమైంది. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేలా ఈ పథకాన్ని కేంద్రం 2008లో ప్రవేశపెట్టింది. ఇందు కోసం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులను అర్హులుగా నిర్దేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో పలువురు బాలబాలికలు ఎనిమిదో తరగతి తర్వాత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదువు మానివేస్తున్నట్లు గుర్తించడంతో 9వ తరగతి నుండి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందించే ఈ పథకం అమలవుతోంది. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశపరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

అర్హతలు.. దరఖాస్తు విధానం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించి, ప్రస్తుతం 8వ తరగతి బాలబాలికలు పరీక్ష రాయడానికి అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల లోపు ఉంటే అర్హులుగా పరిగణిస్తారు. దరఖాస్తు సమయాన ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. ఓసీ, బీసీలైతే రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 6వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆపై దరఖాస్తు ప్రింట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందిస్తే వారు డీఈఓ కార్యాలయంలో సమర్పిస్తారు.

అక్టోబర్ 23న పరీక్ష

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు అక్టోబర్ 23న పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ నగదు నేరుగా విద్యార్థుల అకౌంట్‌లోనే జమ అవుతుంది. అయితే, పదో తరగతి తర్వాత ఉపకార వేతనం అందాలంటే ఎస్సెస్సీలో కనీసం 60 శాతానికి తగ్గకుండా మార్కులు సాధించాలి.

పరీక్షా విధానం

మొత్తం 180 మార్కులకు ఎంపిక పరీక్ష ఉంటుంది. ఇందులో రీజనింగ్,ఆర్థమెటిక్, పదాలభిన్న పరీక్ష, అంకెలు, అక్షరాల ఎనాలజీ, కోడింగ్, డీ కోడింగ్, లాజికల్, వెన్ చిత్రాలు, ప్రతిబింబాలకు సంబంధించి 90మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రెండో విభాగంలో 8వ తరగతి సిలబస్ నుంచే 90 ప్రశ్నలు ఇస్తారు. గణితం 20, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ నుంచి 35, సోషల్ స్టడీస్ 35 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించనుండగా.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎక్కువ మంది హాజరయ్యే ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులకు ఉపయోగం



ఆర్థిక వెసులుబాటు లేని బాలబాలికలకు ఉపకార వేతనాలతో ఉపయోగంగా ఉంటుంది. ఎంపికైతే నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. పరీక్షకు చాలా సమయం ఉన్నందున విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

– పి.శివన్నారాయణ, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ గుబ్బగుర్తి

సమాచారం ఇచ్చాం..



కేంద్రం అమలుచేస్తున్న స్కాలర్‌షిప్ పథకంపై ఇప్పటికే అన్ని పాఠశాలలకు సమాచారం ఇచ్చాం. ఎక్కువ మంది విద్యార్థులతో దరఖాస్తు చేయించి, పరీక్షకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించాం.

– డి.అబ్రహం, ఎంఈఓ కొణిజర్ల

గత ఏడాది ఎంపికయ్యా...



గత ఏడాది పరీక్ష రాసి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యా. ఈ ఏడాది నుంచి నాకు నాలుగేళ్ల పాటు రూ.12 వేల అందుతుందని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు అభినందించగా, మా అమ్మానాన్న సంతోషించారు.

– తాటి షర్మిల, జెడ్పీహెచ్ఎస్, గుబ్బగుర్తి

ఉపాధి అవకాశాలకు 'వికసిత్ భారత్'

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధి అవకాశాలు, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అన్ని రంగాల్లో సామాజిక భద్రతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి వికసిత్ భారత్ ఉద్యోగ యోజనా పథకాన్ని రూపొందించారని వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడీ.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రయోజనాలు 2025 ఆగస్టు 1నుంచి 2027 జూలై 31 మధ్యకాలంలో సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, ఈ పథకం రెండు భాగాలుగా ఉంటుందని, మొదటిభాగం ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి ప్రోత్సాహకంగా ఉంటుందని తెలిపారు. అన్ని వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చే వారికి వేతనం, కొంత భాగాన్ని నిర్దిష్ట కాలానికి ఖాతాలో నిల్వ చేయడం వంటివి అమలవుతాయని వెల్లడించారు. ఇక రెండో భాగం యజమానుల కోసం నిర్దేశించగా.. పలు అర్హతలను పొందుపరిచారని కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

డీఆర్‌డీఓ స్ఫూర్తితో చేయూత



వెంకటకృష్ణకు ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

పెనుబల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఆర్‌డీఓ విద్యాచందన స్ఫూర్తితో దివ్యాంగులకు సహకరిస్తున్నట్లు జోనెబోయిన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అన్నపూర్ణ తెలిపారు. పెనుబల్లి మండలం భవన్నపాలెం గ్రామానికి చెందిన కుంచం వెంకటకృష్ణ ఐదునెలలక్రితం ప్రమాదంలో ఒకకాలు కోల్పోయా డు. ఆయనకు మంగళవారం రూ.12వేలు విలువైన ట్రై సైకిల్‌ను అందజేశాక అన్నపూర్ణ మాట్లాడారు. 1998లో తాను స్కూల్‌కి వెళ్లలేక ఇంట్లో ఉంటే అప్పటి పెనుబల్లి ఎంపీడీఓ విద్యాచందన ట్రై సైకిల్‌ను ఇప్పించారని తెలిపారు. అదే ట్రై సైకిల్‌పై వెళ్తూ డిగ్రీచదివి ఉద్యోగం సాధించిన తాను పది మందికి ట్రై సైకిళ్లు, 12 మందికి వీల్ చైర్లు అందించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చెలికాని నీలాద్రిబాబు, చెక్కిలాల రమేష్, సూరా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే మారేది కాదు...

సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించాలని చూసినా మారబోదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. నేలకొండపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రను తప్పుదారి పట్టించేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. నాడు కమ్యూనిస్టులే ప్రజలను చైతన్యం చేస్తూ నైజాం, దొరల దోపిడీపై పోరాడుతూ వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారని తెలిపారు. కాగా, రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ బుధవారం ఖమ్మంలో జరగనుండగా పార్టీ జాతీయ కార్యదర్శి ఎం.ఏ.బేబి, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని, ఈ సభకు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు బండి రమేష్, బషీరుద్దీన్, గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, మారుతి కొండలరావు, రచ్చా నరసింహారావు తదిరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వైరా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సూచించారు. వైరా మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం బొంతు సమత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు దిగొచ్చే వరకు ఆందోళనలు నిర్వహించాలని తెలిపారు. ఖమ్మంలో బుధవారం జరిగే సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు సుంకర సుధాకర్ , భూక్యా వీరభద్రం, చింతనిప్పు చలపతిరావు, మచ్చామణి, గుడిమెట్ల రజిత, సాంబశివరావు, సుధాకర్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న నాగపద్మజ

ఏన్కూరు: జిల్లాలో డెంగీ కేసుల కట్టడి, వ్యాప్తి జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ తెలిపారు. ఏన్కూరు పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె గ్రామాల వారీగా నమోదైన డెంగీ కేసులు, చికిత్సపై ఆరా తీశారు. అనంతరం అత్యధిక కేసులు నమోదైన పైనంపల్లి తండాను సందర్శించిన డిప్యూటీ సీఈఓ అక్కడ పారిశుద్ధ్య పనులపై సూచనలు చేశారు. ప్రజలు ఇళ్లు, వ్యక్తిగతంగానే కాక పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఎంపీడీఓ రంజిత్‌కుమార్, వైద్యాధికారులు రాములు, మౌనిక, వేమిరెడ్డి భాస్కరరెడ్డి, శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్‌లో కామర్స్ పరిశోధన కేంద్రం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలను మంగళవారం కాకతీయ యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ల బృందం సందర్శించింది. కళాశాల కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని పరిశోధనా కేంద్రంగా గుర్తించేందుకు అవసరమైన లైబ్రరీ, ఈ–జర్నల్స్, ఇంటర్నెట్ సదుపాయం, అధ్యాపకుల అర్హతలను వారు సమీక్షించారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ బృందం చైర్మన్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వ్యవహరించగా, ప్రొఫెసర్లు హనుమంతరావు, పి.అమరవేణి, పి.వరలక్ష్మి, ఎస్.నరసింహాచారి, ఎం.యాదగిరి, కోలా శంకర్ ఉన్నారని వెల్లడించారు. ప్రొఫెసర్లు ఇచ్చే నివేదిక ఆధారంగా పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు అవకాశముంటుందని తెలిపారు. కాగా, కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జకీరుల్లా తెలిపారు.

టీచర్ల సర్దుబాటుపై సమీక్ష

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అదనంగా ఉన్న పాఠశాలల నుంచి అవసరమైన చోటకు ఉపాధ్యాయుల సర్దుబాటుపై అధికారులు మంగళవారం సమీ క్షించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు ఎంఈఓలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొనగా, ఇప్పటికే సిద్ధమైన జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. కలెక్టర్ ఆమోదం అనంతరం టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు వెలువడే అవకాశముందని తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రం మార్పు

సాక్షి ఎఫెక్ట్..



చిన్నారులకు బోధిస్తున్న టీచర్

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి–01 అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చారు. 'చినుకు పడితే వరదే..' శీర్షికన 'సాక్షి'లో మంగళవా రం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ప్రస్తుతం కేంద్రం కొనసాగుతున్న భవనం శిథిలమవడంతో ఖాళీ చేసి అదే వీధిలోని అద్దె భవనంలోకి మార్చారు. అంతేకాకుండా చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని సూపర్‌వైజర్ రమాదేవి ఈ సందర్భంగా తెలిపారు.

అందరూ చూస్తుండగానే ఆత్మహత్య



యువకుడి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం కృష్ణా, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వచ్చే సమయం కావడంతో ప్లాట్‌ఫాంలపై ప్రయాణికులు కిక్కిరిసి ఉన్నారు. అప్పటివరకు అందరితో కలిసి ఉన్న యువకుడు(28) పట్టాల పైకి దిగి వేగంగా వెళ్తున్న గూడ్స్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అంతా నిశ్చేష్టులయ్యారు. సదరు యువకుడి ఆచూకీ తెలియక పోగా, ఆయన కుడిచేయిపై త్రిశూలం టాటూ ఉందని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

నాసిరకం ఆయిల్‌పామ్ విత్తనాలపై దర్యాప్తు జరపాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

సత్తుపల్లి/వైరా: విదేశాల నుంచి నాసిరకం ఆయిల్ పామ్ విత్తనాలు దిగుమతి చేసి తెలంగాణలోని నర్సరీల్లో పెంచడం ద్వారా రైతులకు నష్టం జరిగినందున సమగ్ర దర్యాప్తునకు సహకరించాలని తెలంగాణ ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలో జరిగిన అఖిలభారత కిసాన్ సభ(ఏఐకేఎస్) సమావేశంలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ దవాలే, వీ.జీ.కృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ అంశంపై దర్యాప్తుతో పాటు రైతులకు పరిహారం అందించేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే, పామాయిల్ గెలల టన్ను ధర రూ.25వేలు ఉండేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, ధర నిర్ణయంలో రైతు సంఘాలకు ప్రాతినిధ్యం దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేష్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యతో పాటు నాయకులు టి.సాగర్, బొంతు రాంబాబు, శోభన్, పి.జంగారెడ్డి, శ్రీనివాసులు, సోమయ్య, చందునాయక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధితో బాధపడుతూ వృద్ధుడు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న శీలం లక్ష్మీనరసింహారెడ్డి (52) దీర్ఘకాలంగా మానసిక వ్యాధితోబాధపడుతూ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వృద్ధాప్యం కారణంగా ఆయన తండ్రి సైతం ఇటీవలే మరణించారని కుటుంబీకులు తెలిపారు. ఖమ్మంఅర్బన్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు లక్ష్మీరసింహారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, ఆయన స్వగ్రామం మధిర మండలం మడుపల్లి కాగా, కొంతకాలంగా ఖమ్మంలో ఉంటున్నాడు.

నేపాల్ తిరుగుబాటులో అమెరికా పాత్ర

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సదస్సులో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: నేపాల్‌లో తిరుగుబాటుకు రాజకీయ అస్థిరత్వం, అవినీతి అంతర్గత కారణాలుగా నిలిస్తే, దక్షిణాసియాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా తదితర దేశాల చర్యలు బాహ్య కారణాలుగా ఉన్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. దక్షిణాసియాలో చైనా ప్రభావాన్ని నియంత్రించడానికి అమెరికా అదృశ్యశక్తిగా పనిచేస్తోందని తెలిపారు. నేపాల్‌లో దాడుల్లోనూ ఆ దేశ పాత్ర ఉందనే అనుమానాలు ఉన్నాయని చెప్పారు. కాగా, సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, శిరోమణి, శోభ, కె.శ్రీను, ఆజాద్, రాకేష్, లక్ష్మణ్, వెంకటేష్, లెనిన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పిని గాయపర్చిన కుక్కలు



దుప్పికి చికిత్స చేస్తున్న సిబ్బంది

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం నీలాద్రి అర్బన్ పార్కు నుంచి జనావాసాల్లో వచ్చిన చుక్కల దుప్పిని వీధి కుక్కలు వెంటాడి గాయపరిచాయి. పార్కులో నుంచి మంగళవారం బయటకు వచ్చిన దుప్పి సింగరేణి ఓసీ మెయిన్‌గేట్ ప్రాంతానికి చేరింది. అక్కడ వీధికుక్కలు వెంట పడడంతో సింగరేణి సెక్యూరిటీ కుక్కలను తరిమేశారు. అప్పటికే దుప్పి గాయపడడంతో ప్రాథమిక చికిత్స అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కాగా, దుప్పిని రక్షించిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది విజేందర్, అయ్యప్ప, సుధాకర్, రామకృష్ణ, ప్రభాకర్, బాజిత్, జోసెఫ్‌ను పలువురు అభినందించారు.